క్లుప్తంగా

అప్పన్నకు వైభవంగా నిత్యకల్యాణం



మాంగళ్యధారణ ఘట్టాన్ని నిర్వహిస్తున్న అర్చకులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి గురువారం నిత్యకల్యాణం వైభవంగా జరిగింది. ఆలయ కల్యాణమండపంలో వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను అధిష్టింపజేసి ఉదయం 9.30 నుంచి కల్యాణాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగళ్యధారణ, తలంబ్రాలు తదితర ఘట్టాలతో కల్యాణం జరిపారు. ఉభయదాతలకు స్వామివారి అక్షింతలు, ప్రసాదం, శేష వస్త్రాలను అందించారు.

మర్యాదపూర్వక కలయిక



మాజీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డితో పార్టీ రాష్ట్ర సీఈసీ సభ్యుడు శ్రీనివాసరావు

పరవాడ: శ్రీకాకుళం పర్యటనలో భాగంగా విశాఖ విమానాశ్రయానికి చేరుకున్న మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని రాష్ట్ర సీఈసీ సభ్యుడు పైల శ్రీనివాసరావు గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. నియోజకవర్గంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు ఎదుర్కొంటున్న సమస్యలను ఆయన దృష్టికి తీసుకువెళ్లారు. పార్టీ కోసం ఆహర్నిశలు పనిచేస్తున్న నాయకులకు తగిన గుర్తింపు ఉంటుందని జగన్ చెప్పారని పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం పాల్పడుతున్న దుశ్చర్యలను అడ్డుకోవాలని, అందుకు పార్టీ ఎల్లప్పుడు అండగా ఉంటుందని మాజీ సీఎం భరోసానిచ్చినట్లు తెలిపారు.

అప్పన్న అన్నప్రసాద పథకానికి రూ.లక్ష విరాళం



అక్కయ్యకు బాండ్ అందిస్తున్న దేవస్థాన ఉద్యోగి

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి శాశ్వత అన్నప్రసాద పథకానికి యలమంచిలికి చెందిన తొగరు అక్కయ్య రూ.లక్ష 116 విరాళం ఇచ్చారు. దాతకు స్టోర్స్ సీనియర్ అసిస్టెంట్ పి.సూరిబాబు బాండ్ అందించారు. కార్యక్రమంలో అన్నప్రసాద విభాగం ఉద్యోగి హరి పాల్గొన్నారు. దేవస్థానం తరపున దాతకు స్వామివారి దర్శనం కల్పించి ప్రసాదాన్ని అధికారులు అందించారు.

సీజ్ చేసిన వాహనాలకు వేలం



వాహనాల వేలంపాట నిర్వహిస్తున్న సీఐ సతీష్‌కుమార్

పెందుర్తి: స్థానిక పోలీస్ స్టేషన్‌లో వివిధ కేసుల్లో పట్టుబడి దీర్ఘకాలికంగా ఉండిపోయిన 8 ద్విచక్ర వాహనాలకు పోలీసులు గురువారం వేలం పాట నిర్వహించారు. తహసీల్దార్ ఎం.ఆనంద్‌కుమార్ ఉత్తర్వుల మేరకు సీఐ కె.వి.సతీష్‌కుమార్ సమక్షంలో నిర్వహించిన వేలంలో స్థానిక స్క్రాప్ వ్యాపారి నూకరెడ్డి రూ.28 వేలకు ఆయా వాహనాలకు దక్కించుకున్నాడు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

సింహాచలం: సింహాద్రినగర్, బాలాజీ గార్డెన్ ఫీడర్ పరిధిలో విరాట్‌నగర్ 33/11 కేవీ సబ్‌స్టేషన్ మరమ్మతుల నేపథ్యంలో శుక్రవారం విద్యుత్ సరఫరాకి అంతరాయం ఏర్పడుతుందని విద్యుత్‌శాఖ జోన్-3 ఈఈ పి.శ్రీనివాసరావు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. దీంతో ఫీడర్ పరిధిలోని సింహాద్రినగర్, బాలాజీగార్డెన్స్, దత్తసాయినగర్, ఆర్టీసీ డిపో తదితర ప్రాంతాల్లో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 వరకు విద్యుత సరఫరా ఉండబోదన్నారు.

శివాలయం నిర్మాణానికి విరాళం



సిమెంట్ బస్తాలకు అవసరమయ్యే నగదు అందిస్తున్న కామిరెడ్డి దేముడు దంపతులు

సబ్బవరం: స్థానిక శివాలయ పునర్నిర్మాణానికి సబ్బవరానికి చెందిన రిటైర్డ్ పంచాయతీ ఈవో కామిరెడ్డి దేముడు, సత్యవేణి దంపతులు 200 సిమెంట్ బస్తాలను విరాళంగా అందించారు. కమిటీ సభ్యులు దంగేటి నాని, దంగేటి ప్రకాష్, బర్ల రమణ, కోరాడ శ్రీనివాసరావు, చింతల శ్రీను, గెడ్డం కృష్ణ, కొల్లి కృష్ణ కృతజ్ఞతలు తెలిపారు.

వినాయక చవితి, దసరా, జాతర్లు, తీర్థాల సమయంలో ప్రధాన ఆకర్షణ నేల వేషాలు. అమ్మవార్లు, ఒళ్లు గగుర్పొడిచే కాళీమాత తదితర శక్తి వేషధారుల్ని చూస్తే పిల్లలతోపాటు, పెద్దలకూ ఒళ్లు గగుర్పొడుస్తుంది. అయినా వీటిని చూడాలనే ఆసక్తి, చూసేటపుడు కలిగే ఆనందం చెప్పలేనంత. సబ్బవరం మండలంలోని పైడివాడ అగ్రహారంలో కొలువైన కనకదుర్గమ్మ పండగ మహోత్సవంలో సందడి చేసిన వీరిని పలకరించిన 'సాక్షి', వారి బతుకుల్లోకి తొంగి చూసింది.



జాతరలో ఆకట్టుకుంటున్న శక్తి వేషాలు

ఉగ్రరూప శక్తిస్వరూపిణిగా..

పండగలుంటేనే.. వీరి బతుకు పండగ

- పొట్ట కూటి కోసం నేల వేషాలు
- వేషధారణలో నియమనిష్టలు
- ఖర్చులు పోనూ మిగిలేది కాసింతే..
- సంప్రదాయ కళను పోషిస్తున్న ఉండ్రాజవరం బృందం

సబ్బవరం:

ఉత్తరాంధ్ర జిల్లాలతోపాటు రాష్ట్రం నలుమూలలా, పొరుగు రాష్ట్రాల్లో కూడా ఈ ప్రదర్శనలు ఇచ్చే బృందాలు ఎక్కువగా పశ్చిమగోదావరి జిల్లాకు చెందినవే. వీరికి పండగలు, జాతర్ల రోజుల్లో డిమాండ్ అధికంగా ఉంటుంది. మిగిలిన ఖాళీ సమయాల్లో ఎవరికి చేతనైన పనుల్లో వారు బిజీ అవుతారు. ఎక్కువగా వ్యవసాయం, భవన నిర్మాణ పనులకు వెళ్తుంటారు.

పండగలు, జాతర్లలో బిజీ

దేశంలోని కోల్‌కతా, ఒడిశా, జైపూర్, కర్ణాటక, తమిళనాడు వంటి ప్రాంతాలతోపాటు రాష్ట్రం నలుమూలలా ఈ బృందం సభ్యులు తమ వేషధారణలతో అలరిస్తున్నారు. ప్రోగ్రాంకు వెళ్లిన దగ్గర నుంచి, తిరిగి ఇంటికి చేరుకునే వరకు బృందానికి ఓ వ్యక్తి బాధ్యత తీసుకుంటారు. సంవత్సరం మొత్తంలో వినాయక చవితికి ఎక్కువగా డిమాండ్ ఉంటుంది. ఆ సమయంలో నెలరోజుల పాటు ఇంటికి వెళ్లే పరిస్థితి ఉండదు. దసరా ఉత్సవాల సమయంలో కూడా అంతే. దీంతోపాటు జాతర్లు, తీర్థాలు, పండగల సమయంలో బిజీగా ఉంటారు. ఖాళీ సమయాల్లో ఇతర పనులకు వెళ్తారు. ప్రోగ్రాం ఉంటే ఫోన్లో సమాచారం తెలుసుకుని, అంతా సిద్ధమవుతారు. ఈ బృందం అంతా ఒకే గ్రామానికి చెందినవారు కాదు. చుట్టుపక్కల గ్రామాలు, ప్రాంతాలకు చెందిన పరిచయస్తులు.

ఒక్కో బృందంలో 15 మంది

ఒక్కో బృందంలో 15 మంది సభ్యులు ఉంటారు. వారిలో ఇద్దరు మహిళలు.ఒక్కో ప్రోగ్రాంకు రూ.30 వేలకు అటూఇటుగా తీసుకుంటారు. దూర ప్రాంతాలకు వెళ్లే సమయంలో రవాణా ఖర్చులు అదనం. సొంత వాహనంలో వెళ్తుండటంతో ఒడిశా వంటి దూర ప్రాంతాలకు వెళ్లే సమయంలో రవాణా ఖర్చులతో కలిసి రూ.70 వేలు వరకు చెల్లించాలి. బృందంలో 11 మంది పలు అమ్మవార్ల వేషధారణతో పాటు మహిళా వేషధారణ వేసుకోగా, నలుగురు డప్పు కళాకారులు ఉంటారు. ఒక్కొక్కరికి రోజుకు రూ.1300 చొప్పున ఇవ్వగా అత్యధికంగా కాళీ మాత వేషధారణలో ఉన్న వ్యక్తికి రూ.2,500 వరకు ఇస్తారు. చార్జీల రూపంలో అదనం రూ.100 చొప్పున చెల్లిస్తారు. వీరికి నేతృత్వం వహించే వ్యక్తికి సొంత వాహనం ఉండటంతో, అతనే డ్రైవర్ బాధ్యతలు చూసుకుంటారు.



ఆకట్టుకుంటున్న అమ్మవార్ల వేషధారణలు

మేకప్ ఖర్చంతా లీడర్‌దే..

వేషధారణ మీద ఆసక్తితోపాటు, వేషంలో ఉన్న సమయంలో నియమ నిష్టలు పాటించే వారిని మాత్రమే బృందంలో చేర్చుకుంటారు. వేషధారణకు అవసరమైన సామగ్రి బాధ్యత అంతా లీడరే చూసుకుంటారు. పదిమంది వేషధారణకు ఇద్దరు మేకప్ మెన్‌లు అవసరం. ఇందుకు దాదాపు నాలుగైదు గంటల సమయం పడుతుంది. వేషధారణకు వినియోగించే పెయింట్లు తుడుచుకుందామన్నా అంత సులభంగా పోవు. సబ్బు, కొబ్బరి నూనె వినియోగించి చాలా గట్టిగా రుద్దాలి. ఒక ప్రోగ్రాంకు మేకప్ పెయింటింగ్ సామగ్రికే రూ.3 వేలకు పైగా వెచ్చించాలి. నిత్యం ఉపయోగించే అమ్మవారి అలంకరణ సామగ్రి కిరీటం, త్రిశూలం, ఆభరణాలు, చీరల కొనుగోళ్లు, వాటి నిర్వహణకు అదనపు పెట్టుబడి తప్పదు.

ఖాళీ సమయంలో కూలి పనులు



రెక్కాడితేగానీ డొక్కాడని బతుకులు మావి. చాన్నళ్ల నుంచి శక్తి వేషాలు వేస్తున్నా. మనోహర కాళీమాత బృందంతోనే కొనసాగుతున్నా. కాళీమాత వేషధారణ వేస్తాను. పండగలు, జాతర్ల సమయంలో ఎక్కడ ప్రోగ్రాం ఉంటే అక్కడకు వెళ్లిపోతాం. ప్రోగ్రాంలు లేని రోజుల్లో ఊర్లో వ్యవసాయ పనులుంటే పొలాల్లో, లేకుంటే కన్‌స్ట్రక్షన్ పనుల్లోకి వెళ్తా. కుటుంబాన్ని నెట్టుకు రావడానికి దొరికిన పని చేసుకుంటూ పోవాలి కదా..!

– రాసూరి స్వామి, శక్తి వేషధారి, ఉండ్రాజవరం

పెద్దగా మిగిలేదేం ఉండదు



తాత తండ్రుల నుంచి వస్తున్న సాంప్రదాయం శక్తివేషాలు. మాకు శ్రీ మనోహర కాళీ మాత డ్యాన్స్ బృందంతోపాటు, అఘోర, ప్రబల అమ్మవార్ల వేషధారణ బృందాలు కూడా ఉన్నాయి. వేషధారణ ఉన్న సమయంలో ఎంతో నిష్టగా ఉంటాం. సాంప్రదాయంగా వస్తున్న కళను పోషించాలని తపన తప్ప, దీనిలో పెద్దగా మిగిలేదేమీ ఉండదు. బృందంలోని సభ్యులకు వచ్చినట్టే నాకూ కూలి డబ్బులే మిగులుతాయి.

– పోతిన శ్రీనివాస్, శ్రీ మనోహర కాళీమాత బృంద నిర్వాహకుడు

బడ్జెట్ ప్రతులు దగ్ధం చేసి నిరసన



బడ్జెట్ ప్రతులను దగ్ధం చేస్తున్న సిటు ప్రతినిధులు

పరవాడ: కేంద్ర ప్రభుత్వం పార్లమెంటులో ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో ఆంధ్రప్రదేశ్ ప్రజల ఆశలను అడియాశలు చేసిందని సీఐటీయూ(సిటు) జిల్లా ఉపాధ్యక్షుడు గనిశెట్టి సత్యనారాయణ ఆరోపించారు. బడ్జెట్‌లో రాష్ట్రానికి మొండి చేయి చూపించినందుకు నిరసనగా వామపక్ష పార్టీల పిలుపు మేరకు పరవాడ సినిమాహాలు కూడలిలో ఏర్పాటు చేసిన నిరసన కార్యక్రమంలో కేంద్ర బడ్జెట్ ప్రతులను గురువారం దగ్ధం చేశారు. ఈ సందర్భంగా గనిశెట్టి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం మరోసారి ఏపీ ప్రజలను మోసం చేసిందన్నారు. ప్రత్యేక హోదా, వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధి ప్యాకేజీ, విభజన హామీలను పక్కన పెట్టిందని విమర్శించారు. విశాఖ రైల్వే జోన్, ఎన్ఐటీ, ఐఐటీ, ఐఐఎం, ట్రిబుల్ ఐటీ, గిరిజన యూనివర్సిటీ, సెంట్రల్ యూనివర్సిటీ, దుగ్గరాజుపట్నం పోర్టు, కడప స్టీల్ ప్లాంట్, వైజాగ్ మెట్రో, ఎయిమ్స్, వెనుకబడిన జిల్లాల నిధులు, రాజధాని నిధుల ఊసే బడ్జెట్‌లో చేయకపోవడం దారుణమన్నారు. కార్యక్రమంలో కె.నాయుడు, బి.లచ్చిబాబు, కె.అప్పారావు, జి.శ్రీను పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలపై ఆటో డ్రైవర్లకు అవగాహన



లంకెలపాలెంలో ఆటోడ్రైవర్లతో మాట్లాడుతున్న సీఐ మల్లికార్జునరావు

పరవాడ: మద్యం సేవించి ఆటోలు నడిపే డ్రైవర్లపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని పరవాడ ఎస్ఐ బి.కృష్ణారావు హెచ్చరించారు. పరవాడ సీఐ ఆర్.మల్లికార్జునరావు ఆధ్వర్యంలో లంకెలపాలెం, పరవాడ, వెన్నలపాలెం, వాడచీపురుపల్లి, ముత్యాలమ్మపాలెం గ్రామాల్లోని ఆటో యూనియన్ సభ్యులతో గురువారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఎస్ఐ కృష్ణారావు మాట్లాడుతూ ఆటోలో పరిమితి మించి ప్రయాణికులను ఎక్కించరాదన్నారు. అతివేగంతో ఆటోలను నడపరాదన్నారు. వాహనం నడిపిన వ్యక్తుల వద్ద అన్ని రికార్డులు విధిగా ఉండాలన్నారు. గంజాయి, ఇతర అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్న వ్యక్తుల వివరాలను పోలీసులకు అందజేయాలని సూచించారు. ఆటో డ్రైవర్లు విధిగా ట్రాఫిక్ నిబంధనలను పాటించాలని, లేకుంటే చర్యలు తప్పవని హెచ్చరించారు. సమావేశంలో ఎస్ఐ మహాలక్ష్మి, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

రైతు సంక్షేమ పథకాలకు ఫార్మర్ రిజిస్ట్రీ తప్పనిసరి



సబ్బవరం ఆర్ఎస్‌కే వద్ద రిజిస్ట్రేషన్ ప్రక్రియను పరిశీలిస్తున్న సబ్ డివిజన్ ఏడీఏ రామారావు

సబ్బవరం: రైతులందరూ విధిగా తమ పేర్లను ఫార్మర్ రిజిస్ట్రీలో నమోదు చేసుకోవాలని అనకాపల్లి సబ్ డివిజన్ ఏడీఏ ఎం.రామారావు తెలిపారు. మండలంలోని పలు రైతు సేవా కేంద్రాలను గురువారం ఆయన సందర్శించారు. ఫార్మర్ రిజిస్ట్రీ తీరును పరిశీలించారు. రైతులంతా ఈ నెల 25లోగా ఆర్ఎస్‌కేలను సదర్శించి, తమ భూమి వివరాలు గల 1బి, ఆధార్, ఫోన్ నెంబర్లు ఇచ్చి రిజిస్ట్రేషన్ చేయించుకోవాలన్నారు. తద్వారా 11 అంకెల గుర్తింపు కార్డు పొందుతారని, దీంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందిస్తున్న సంక్షేమ పథకాలు సులభంగా పొందవచ్చన్నారు. అంతకాపల్లి, సబ్బవరం, తవ్వవానిపాలెం రైతు సేవా కేంద్రాలను సందర్శించారు. ఇప్పటి వరకూ మండలంలోని 8,300 మంది అర్హులైన రైతుల్లో 4,400 మంది తమ వివరాలను నమోదు చేసుకున్నట్లు వెల్లడించారు. ఆయన వెంట ఏఈవో భావన, శ్రావణి, కిశోర్, తవ్వవానిపాలెం సర్పంచ్ బోకం స్వామినాయుడు తదితరులు ఉన్నారు.

దాబాల్లో మద్యం విక్రయిస్తే చర్యలు



దాబా యజమానులతో సీఐ మల్లికార్జునరావు

పరవాడ: మండలంలోనిలంకెలపాలెం, పరవాడ, మంత్రిపాలెం ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన దాబాల్లో మద్యం విక్రయించినా, తాగినా ఆయా యజమానులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని పరవాడ సీఐ ఆర్.మల్లికార్జునరావు హెచ్చరించారు. దాబా యజమానులతో గురువారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో సీఐ మాట్లాడారు. మద్యంతో దాబాలకు వచ్చిన వారిని అనుమతించవద్దని చెప్పారు. సమావేశంలో ఎస్ఐలు బి.కృష్ణారావు, మహాలక్ష్మి పాల్గొన్నారు.

ఫుడ్ పాయిజన్ కారణాలు బహిర్గతం చేయాలి





బాధిత విద్యార్థినులను పరామర్శిస్తున్న సీపీఐ, ఏఐవైఎఫ్, ఏఐఎస్ఎఫ్ నాయకులు

పెందుర్తి: స్థానిక ఇందిర స్కూల్ ఆఫ్ నర్సింగ్‌లో ఫుడ్‌పాయిజన్‌కు గల కారణాలను బహిర్గతం చేయాలని సీపీఐ, ఏఐవైఎఫ్ నాయకులు ఆర్.శ్రీనివాస్, కె.అచ్యుత్, వై.రాంబాబు డిమాండ్ చేశారు. అస్వస్థతకు గురై స్థానిక ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న నర్సింగ్ విద్యార్థినులను గురువారం పరామర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థినులకు మెరుగైన వైద్యం అందించాలని కోరారు. అనుమతుల్లేకుండా జిల్లాలో నిర్వహిస్తున్న నర్సింగ్ కళాశాలలు, హాస్టళ్లు, విద్యా సంస్థలను గుర్తించి వాటిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు.

సమస్య వచ్చినప్పుడే నిద్రలేస్తారా..

ఏదైనా సమస్య వచ్చినప్పుడే అధికారులు హడావుడి చేస్తారు తప్ప, నిబంధనలకు విరుద్ధంగా ఉన్న విద్యా సంస్థలు, హాస్టళ్లను ముందుగా గుర్తించి, చర్యలు ఎందుకు తీసుకోవట్లేదని ఆలిండియా స్టూడెంట్ ఫెడరేషన్(ఏఐఎస్ఎఫ్) జిల్లా కార్యదర్శి యు.నాగరాజు ప్రశ్నించారు. చికిత్స పొందుతున్న విద్యార్థినులను సంఘం ప్రతినిధులు పరామర్శించారు. కలెక్టర్ చొరవచూపి ఇందిర నర్సింగ్ కళాశాల ఘటనపై సమగ్ర విచారణ చేపట్టాలని ఏఐఎస్ఎఫ్ ప్రతినిధులు పి.శేఖర్, అభిషేక్, రమేష్, కిరణ్ డిమాండ్ చేశారు.

బంగారు ఆభరణాల చోరీపై ఫిర్యాదు

సబ్బవరం: మండలంలోని ఇరువాడ గ్రామంలో ఓ ఇంట్లో బంగారు అభరణాలు కనిపించకపోవడంపై కుటుంబ సభ్యులు సబ్బవరం పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాలు.. గ్రామానికి చెందిన కార్ల జగ్గ అప్పారావు ఈ నెల 13న ఉదయం కుటుంబ సభ్యులతో కలిసి విశాఖపట్నం వెళ్లారు. అదేరోజు మధ్యాహ్నం తన చిన్న కుమారుడు భోజనం చేసి, ఇంటికి తాళం వేసి డ్యూటీకి వెళ్లిపోయాడు. తర్వాత పెద్ద కుమారుడు ఇంటికి వెళ్లి చూడగా, తాళం కింద పడి ఉండటం గుర్తించాడు. గురువారం మధ్యాహ్నం బ్యాంక్ బుక్ కోసం లాకర్ ఒపెన్ చేయగా, లాకర్‌లో ఉండాల్సిన 8 తులాల బంగారు అభరణాలు కనిపించలేదు. దీనిపై పోలీస్‌లకు ఫిర్యాదు చేయడంతో, ఎస్ఐ సింహాచలం కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

ఘనంగా కనకదుర్గమ్మ పండగ మహోత్సవం



పూజలందుకున్న కనకదుర్గమ్మ అమ్మవారు

సబ్బవరం: మండలంలోని పైడివాడ అగ్రహారంలో కనకదుర్గమ్మ పండగ మహోత్సవం గురువారం ఘనంగా జరిగింది. అమ్మవారిని అధిక సంఖ్యలో మహిళలు దర్శించుకుని పసుపు కుంకుమలు, చీరలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. ఉత్సవం సందర్భంగా అమ్మవారిని పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేష్ బాబు, మాడుగుల ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి దర్శించుకుని, ప్రత్యేక పూజలు జరిపారు. అమ్మవారి అనుపు మహోత్సవంలో భాగంగా ఏర్పాటు చేసిన నేల వేషాలు, సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. చుట్టు ప్రక్కల గ్రామాలతో పాటు జిల్లా నలుమూలల నుంచి అధిక సంఖ్యలో భక్తులు, తరలి వచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు.

అధినేతతో ఆత్మీయ భేటీ



మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితో గుడివాడ అమర్‌నాథ్, అదీప్‌రాజ్, మెంటి మహేష్

పెందుర్తి: శ్రీకాకుళం పర్యటన నిమిత్తం నగరానికి వచ్చిన మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని నియోజకవర్గ సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్ రాజ్ గురువారం కలుసుకున్నారు. నగరంలోని ఎయిర్‌పోర్టులో కలిసి పలు అంశాలపై చర్చించారు. పెందుర్తి నియోజకవర్గ మున్సిపల్ విభాగం అధ్యక్షుడిగా నియమితులైన పార్టీ నేత మెంటి మహేష్.. తనకు అవకాశం కల్పించినందుకు అధినేత వైఎస్ జగన్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

వైఎస్సార్‌సీపీ అనుబంధ విభాగాల అధ్యక్షులు వీరే..

పెందుర్తి: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పెందుర్తి నియోజకవర్గ అనుబంధ విభాగాల అధ్యక్షులను నియమిస్తూ పార్టీ కేంద్ర కార్యాలయం గురువారం ప్రకటన విడుదల చేసింది. పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు ఈ నియామకాలు చేపట్టారు. బయలపూడి భగవాన్ జయరాం-గ్రీవెన్స్(పార్టీ, ప్రజాసమస్యలు), సీలం నదియా-మహిళా విభాగం, వడ్డాది అప్పలరాజు-రైతు విభాగం, రాపేటి రాము-బీసీ సెల్, వంగలపూడి గణేష్-ఎస్సీ సెల్, షేక్ ఖాన్ సాహెబ్-మైనార్టీ సెల్, గాలి నూకరాజు(చరణ్)-విద్యార్థి విభాగం, మదుపాడ రామాంజనేయులు(అంజి)-పంచాయతీరాజ్, మెంటి అప్పలనాయుడు(మహేష్)-మున్సిపల్, మట్టా ప్రసాద్-ఆర్టీఐ, అవగడ్డ శ్రీనివాసరావు-వలంటీర్ విభాగం, కొవిరి షణ్ముఖ్ శివకుమార్-వాణిజ్య, జేకే వెంకటరావు కానూరి-వీవర్స్, యనమరెడ్డి బాబూరావురెడ్డి-వైఎస్సార్‌టీయూసీ, యర్రా శ్రీనివాసరావు-లీగల్ సెల్, కర్రి రాజు-సాంస్కృతిక, ఉగ్గిన నాగరాజు-సోషల్ మీడియా, చొప్పా అనిల్‌కుమార్-ఐటీ, పట్నాల లక్ష్మణరావు-దివ్యాంగ, కొటాన రమేష్-వైద్య విభాగం, వెన్నల సన్యాసిరావు-బూత్ కమిటీలు, సుందరపు అప్పారావు-పబ్లిసిటీ విభాగం అధ్యక్షులుగా నియమితులయ్యారు.